
# సుధ

నవీన



ఆ వేసవి కాలపు ఉషస్సు చాల ఆహ్లాదకరంగా ఉంది. మామిడీగుంపుల్లో కోకిలలు పోటీలుపడి కూస్తున్నాయి. తూర్పు ఆకాశం అరుణారుణ కాంతులతో సూర్యునికి స్వాగతం పలుకుతోంది. చల్లని పిల్ల తెమ్మెరలు శరీరానికి చక్కిలిగింతలు పెడ్తున్నాయి.

సుధ మళ్ళీ ఒకసారి మత్తుగా ఆవలించింది. ఇక నిద్రమబ్బులు వదిలినట్లే' అనుకొంది. ఆ ఉదయపు ప్రశాంత వాతావరణం ఆమెమనస్సును ఏవేవో తియ్యని ఊహలతో నింపుతున్నది. ఉయ్యాల ఊపు తున్నట్లుగ బండిఊపు, జోలపాట లాగా ఎదులమెడల్లోని గజ్జెల సంగీతం, అప్పుడే నిద్రనుండి మెలకువలోకి వచ్చిన సుధను నిద్రాకాని, మెలకువాకాని ఒక స్వప్నావస లోకి తీసుకు పోతున్నాయి. మధుర స్మృతుల చిత్రరూపాలు ఆమె భావనా జగత్తులో తమ పాల్ని చూపించు కొంటున్నాయి.

"వెళ్తావా సుధా! నిన్ను విడిచి ఎలా బ్రతకను ....నీ కన్నుల్లోకి తప్పచూడలేని నా కన్నులకి ఏం పనిచెప్పి వెడ్తావు నీ వడిలో తప్ప నిద్రపోలేని నన్ను ఎవరికప్పగించి వెడ్తావు ...." వారలా బాధగా అంటుంటే తన హృదయంఏదో వెర్రి ఆనందంతో నిండిపోయింది .... ఎప్పుడూ అలా వారిమాటలు వింటూ వారి కళ్ళల్లోకి చూస్తూ వారిహృదయానికి హత్తుకు పోవాల నిపిస్తుంది. నిజంగా

తనను విడిచి ఈ నాలుగు రోజులు ఎలా ఉంటారో. పసివాడి కంటే అన్యాయం .... ఎప్పుడూ యేదో చెప్తూనే ఉంటారు ఆ కళ్ళు ఎప్పుడూ చిలిపిగా నవ్వుతూనే వుంటాయి..... యేదో చిలిపిమాట అనే యటానికి ఆ గులాబి రెక్కల్లాంటి పెదవులు ఎప్పుడూ తయారుగా ఉంటాయ్.... ఆ చేతులు ఎప్పుడూ ఏదో అల్లరి చేస్తూనే వుంటాయి

"ఎంత దయలేనివాడివి సుధా! నీ కోసం నాలుగు గంటలనుండి క్షణమొక యుగంగా ఎదురు చూస్తున్నా"

"అబ్బ నాల్గు గంటలు కాదు కదా నాల్గు నిమిషాలు కూడా కాలేదు నేను మీ దగ్గరనుండి వెళ్ళి ....ఎప్పుడూ మీ దగ్గరే కూర్చుంటే అత్తయ్య యేమనుకుంటుంది చెప్పండి.?"

"ఏమి అనుకోదు. నా కొడుకూ కోడలు చిలకా గోరింకల్లాగ హాయిగా కాపరం చేస్తున్నారని మురిసి పోతుంది. ఇప్పటి నుంచి నన్ను విడిచి ఒక్క క్షణం కూడా ఉండటానికి వీలు లేదు."

"ఎలాగండీ మీతో? ఇంటి పనంతా అత్తయ్య మీదేపడేసి మీతోఇరవై నాలు గంటలూ ఉండిపోనా? ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు .... కోడలొచ్చిన అత్తకు సుఖంలేదని నన్నంటారు.?"

"కాను.... అంటారు.... ఈ ప్రపంచమంటే అంతే సుధా! ఎవరి లోకంలో వాళ్ళను వుండనీయరు. మనం వీళ్ళ మధ్య బ్రతకలేం మనం ఇక్కడ నుంచి వెళ్ళిపోదాం. ఒకక్రొత్తప్రపంచం లోకి. అక్కడ నువ్వూ నేను తప్ప మరెవరూ ఉండరు." అంతే ....అలా వారు కలల్లోకి వెళ్ళిపోతారు.

సుధ మళ్లీ ఒకసారి ఆవులించింది.

"హడీ హడీ! అంటూ కొమురడు బండి తోలుతున్నాడు. ఒక లయలో గజ్జెలు మ్రోగుతుంటే ఎడ్లు పరుగెడుతున్నాయి.

"ఎంత దూరం వచ్చారాంకొమురా?" అడిగింది సుధ.

'ఎక్కడమా, ....కోసెడుదూరమన్నా దాటలే.... పొద్దుగాల యెల్లిపోవల్నె యిగ కాసెయితే కొరకాసు పెట్టినట్టు యెండ. అగో పొద్దుగూడ పొడుస్తాంది. మనూరు దగ్గరున్నదా! బువ్వాళ్ళొరకన్నా పోతామో పోమో."

సుధ మళ్ళీ తనలోకంలోకి పోయింది వస్తున్నప్పుడు వారెంత అల్లరి చేసారు.

"ఈ ఆడవాళ్ళకి తల్లిగారిల్లు లేకపోతే బావుండేది. మాటిమాటికి యిలా బండి తోలించి మా ప్రాణాలు తీసే వాళ్ళు కాదు. ఇప్పుడు వెళ్ళక పోతే ఏం సుధా! నువ్వొచ్చి నాల్గు రోజులు కూడా కాలేదు.

తనకి నవ్వొచ్చింది. తనొచ్చి అప్పటికి రెండునెలలయ్యింది. ఉగాదికూడా అక్కడే గడిపింది. నాల్గురోజులన్నా కాలేదు వారికి.

నాన్న మిమ్ముల్నికూడా రమ్మన్నారట వచ్చేయేం — నాల్గు రోజులుండి మళ్ళా కలిసే వద్దాం."

"అమ్మో! ఆ వూరికే ఒక్కక్షణం కూడా తోచదు. తమరేమో ఎక్కడో స్నేహితురాళ్ళతో, వదినలతో ముచ్చట్లు పెడుతూ నన్ను మరచిపోతారు....దానికి

తోడు మీ ఊరికొస్తే మీ అన్నగార్లతో వేగలేను. ఆయనింటికి వెడితే ఈయనికి కోపం. ఈయనింటికివెడితే ఆయనికి కోపం. వాళ్ళు పోటీలుపడి చూపించే ఆ ప్రేమను భరించలేను. వాళ్ళు కుండల కొద్దీ తాగింది చాలక నన్నుకూడా తాగమని వాళ్ళుచేసే ఆ బలవంతం జ్ఞాపకం చేసుకుంటే భయంవేస్తుంది."

ఔను.... వారెప్పుడు వచ్చినా రెండు మూడు రోజులకంటే ఎక్కువ ఉండలేరు. పెదన్నకూ,చిన్నన్నకూ ఎప్పుడూ ఏదో పోట్లాట ఉంటూనేఉంటుంది. ఇద్దరూ చాలా మూర్ఖంగా ప్రవర్తిస్తారు. ఎవరూ అంతగా చదువుకోలేదు కనీసం వారితో సరిగా మాట్లాడటంకూడా తెలియదు. అయినా వాళ్ళకు తనంటే ఎంత ప్రేమ! తను వారికి ఒక్కగానొక్క చెల్లెలు .... అందుకే తనంటే ప్రాణాలిస్తారు....వాళ్ళిద్దరూ కలిసి ఉండాలని తను ఎదురైన దేముడికల్లా మొక్కుకుంటుంది. కాని వాళ్ళ శతృత్వం రోజు రోజుకూ పెరుగుతున్నదేకాని తరగడంలేదు. వారెప్పుడు ఆ వూరొచ్చిన యిద్దరు ఏదోవిధంగా వారిని బాధిస్తూనే ఉంటారు. అందుకే వస్తూంటే అన్నారు. "నువ్వైనా ఎందుకు వెళ్ళటం సుధా! మీ అన్నల విషయం ఏదో కల్పించుకోబోతావు. వాళ్ళు ఓ మాట పట్టించుకోరు....నువ్వు బాధపడ్తావు....ఎందుకు చెప్పు మనకిదంతా ...."

"కాదండీ ఇక ఎప్పుడూ అన్నయ్యల విషయంలో జోక్యం తీసికోదలచుకోలేదు. నాన్న అంతగా రమ్మన్నారు. ఈ వయస్సులో వారికి మనశ్శాంతి అనేది ఎప్పుడూ ఉండక ఎంతో క్రుంగిపోతున్నారు. ముఖ్యంగా అన్నల పోట్లాట నన్నుచూసైనా నాల్గురోజులు అన్నీ మరచిపోగల్గుతాదేమో ఓ పది రోజులుండి వచ్చేస్తాను మిమ్మల్ని విడిచి నేనుమాత్రం బ్రతకగలనా?"

"అమ్మో! నాల్గురోజులే....96 గంటలన్నమాట. అంటే 96 గంటలన్నమాట


## డాక్టరు డి. కనకారావు

సెక్సు స్పెషలిస్టు

### దాంపత్య జీవితంలో అశాంతియా?


నపుంసకత్వము, శుక్లనష్టము, సంతానహీనత, స్త్రీల ఋతువ్యాధులు, మధుమేహము, సుఖవ్యాధులతో బాధపడుతున్నారా? వెంటనే మాతో సంప్రదించండి.

మీ పూర్తి అడ్రసు వ్రాసి 20 పైసల కవరు జతపరచండి.

### నవజీవన చికిత్సాలయం

శేషాద్రిశాస్త్రి వీధి, ఏలూరురోడ్డు గవర్నర్ పేట,

విజయవాడ-2.




అబ్బ.... బతకగలనా?"

"మీరు మరీ యిదండి"

'యేదండీ?' తన పెదవులమీద మృదువుగా వారి పెదవులు.

"అబ్బ! యెలాగండి మీతో?"

"ఇలాగండి" వారి చేతుల్లోకి తీసుకున్నారు. పసిపాపలా వారిమీద ఒరిగిపోయింది.... వారి గుండెల చప్పుడును వింటూ అలా వారి హృదయంమీద ఎంత సేపుందో ....

"సుధా! ఎప్పుడూ ఇలాగే ఉండిపోవాలనిపించడం లేదూ? ఇలాగే శిలలమైపోతే ఈ కౌగిలిని శాశ్వతం చేసుకోగల్గేవాళ్ళం కాదు?"

యేదో పారవశ్యంలో వింటూంది. తనను తాను మరచిపోయింది, తనులేదు తనను సర్వస్వమూ కొల్లకొట్టుకున్నారు. ఔను.... వారన్నట్లు ఎప్పుడూ అలాగే ఉండిపోగల్గితే అలా ఎంత సేపున్నారో.

"సుధా!" అని నెమ్మదిగా పిలుస్తున్నారు తననెవరో.... ఎక్కడో ఏ లోకంలోంచో పిలుస్తున్నట్లుగా సన్నగా, తియ్యగా వినిపిస్తోంది. వారి కౌగిలిలో మత్తుగా కళ్ళు తెరచింది. కలలోంచి నిజంలోకి వచ్చిందో, నిజంలోంచి కలలోకి వచ్చిందో తెలియని ఒక మధురాతి మధురమైన క్షణమది.

"అమ్మ పిలుస్తోంది. మీరువెళ్ళే టైమైనట్లుంది.... లే సుధా!" అంటున్నారు. "సుధా" అత్తయ్య పిలుపు .... "లేచి అన్ని సదురుకో పొద్దుగాలే వెళ్ళిపోతే మంచిది. తెల్లారితే నిప్పులు

కురిసే ఎండ"

"అలాగే అత్తయ్యా" అంది నిద్ర మబ్బు వదలడంలేదు. వారి కౌగిలి విడిచి వెళ్ళాలనిపించడంలేదు.

"నిజంగా వెళ్తున్నావా సుధా?" తన వెంట్రుకల్ని సరిచేస్తూ వారు. తనకి నిజంగా వెళ్ళాలనిపించడం లేదు. ఆ క్షణంలో వారితో అలా ఉండడంకోసం ప్రపంచంలో దేనినైనా వదులుకోవాలని పిస్తోంది

"ఖాళీబండి పంపించేద్దాం. వెళ్ళను" అంటూ వారిగుండెలకు హత్తుకుపోయింది. కాస్సేపు అలా వుండి పోయారు.

"పద సుధా! నువ్వొచ్చి రెండు నెలలు దాటింది. ఇప్పుడుకూడా వెళ్ళక పోతే మీ నాన్న చాలా బాధపడతారు. మీ నాన్నకోసం నువ్వు తప్పకుండా వెళ్ళాలి ఈ వృద్ధాప్యంలో ఆయనకు నువ్వుతప్ప ఎవరున్నారు? మీ అమ్మ చనిపోయినప్పటినుంచి నిన్ను చూసు కునే బ్రతుకుతున్నాడట ...మా అమ్మ చాలాసారు చెప్పింది నీకు చిన్నప్పటి నుంచి తల్లీ తండ్రీ ఆయనేట-నిన్ను విడిచి ఎలా ఉండగలుగుతున్నాడో...."

వారలా మాట్లాడుతుంటే ఆనందంతో తన హృదయం పగిలిపోతుందా! అనిపిస్తుంది నన్నమీదున్న వారి అసానుభూతిచూస్తే తన హృదయం పరవశించిపోతుంది. తను వారికి ఎంత కావలసినా నాన్నకు తనమీది ప్రేమను అర్థంచేసుకునే హృదయుంవారి కుండటం తను ఏ జన్మలోనో చేసుకున్న పుణ్యఫల మనిపిస్తుంది. అప్పగింతల సమయంలో తనను వారిచేతుల్లోపెడ్తూ కళ్ళనీళ్ళు తుడుచుకుంటున్న నాన్ననుచూస్తే వారికి కూడా దుఃఖమొచ్చిందట .... ఎంతో కష్టంగా ఉబికివస్తున్న కన్నీళ్ళను ఆపు కున్నారట ....

"అప్పుడు మీ నాన్ననిచూస్తే శకుంతలను అత్తవారింటికి పంపిస్తున్న కణ్వ మహర్షి జ్ఞాపకం వచ్చాడు సుధా!" అని చెప్పారు తర్వాత ఒకరాత్రి అలా శకుంతల కథంతా చెప్పారు. వారు కథలు ఎంత చక్కగా చెప్తారు. తనంతగా చదువుకోలేదు యేవో పత్రికల్లోవచ్చే కథలు చదివి అర్థం చేసికోగలదు కాని వారు చెప్పేకథలు అలాగుండవు అలా వారు చెప్తుంటే గంటలకి గంటలు హాయిగా గడుస్తాయ్....శకుంతల కథ ఎన్నిసార్లు వినలేదు కాని వారుచెప్తుంటే అప్పుడే క్రొత్తగా విన్నట్లుగాఉంటుంది. నాన్ననిచూస్తే శకుంతలతండ్రి కణ్వుడు జ్ఞాపకం వస్తాడట వారికి... తను వెళ్తున్నానంటే అంత అల్లరిచేసిన వారే చివరకు "వెళ్ళు సుధా! నువ్వు వెళ్ళకపోతే మీనాన్న చాలా బాధపడ్తారు" అన్నారు. అత్తయ్య మళ్లీ ఒకసారి అత్తపెట్టింది. మత్తుగా అయిష్టంగా, భారంగా పక్కమీదనుంచి లేస్తోంటే "కొన్నాళ్ళదాకా ఇదే ఆఖరు కౌగిలి .. యివే ఆఖరుముద్దులు" అంటూ వారు ఉక్కిరిబిక్కిరి చేసారు.

త్వరగా సర్దుకొంది. బండి క్షణానికి సిద్ధమైంది ....

"జాగ్రత్తగా వెళ్ళమ్మా....వెళ్ళడం తోటే క్షేమంగాచేరింది, నాన్నగారి

ఆరోగ్యం తెలుపుతూ ఉత్తరం రాయి. అందర్నీ అడిగానని చెప్పు"—అంటున్న అత్తగార్కి, మామగార్కి మ్రొక్కి బండెక్కింది. తనను అత్తా మామకూడా ఎంతో ప్రేమగా వారి కన్నకూతురులా చూసుకుంటారు. అంతా తన అదృష్టం.

"ముందటబాట బాగలేదు. పెద్దకయ్య వస్తాంది మంచిగ కూసోండమ్మా" అన్న కొమురని మాటతో ఈ లోకంలోకి వచ్చింది సుధ. ఇంతసేపు తను బండిలో ప్రయాణం చేస్తున్నానన్న సంగతే మరచిపోయింది.

"ఎంతదూరం వచ్చాంరా" అడిగింది.

"ఆమడమూరం దాటినం.... అప్పుడే అంబటాళ్ళయింది.

బువ్వాళ్ళొరకన్న చేరబోతం."

కాస్సేపు కొమరనితో ముచ్చటించాలని పించింద.

"సరేగాని కొమరా ఊళ్ళో అంతా నిమ్మళంగా ఉన్నార్రా ?"

"ఎక్కడిదమ్మా మనూరంత పాడూరు దేశంలోలేదు .... యెప్పటికీ యేదన్న లొలి ఉండనే ఉంది."

"మల్లీ యిప్పుడేం వచ్చిందేమిటి ?"

"యేదో ఓట్లటమ్మా....ఓట్లు పంచాయితి బోంట దానికి నెంబర్లను యెన్నుకోవాళ్నట ఊళ్ళో జనం అంతా రెండు కమిటీలు గట్టింర్రు .... ఆరికి ఈరు, ఈరికి ఆళ్ళు ఎప్పుడు పుల్లలు పెట్టుకోడం ...తన్నుకోటం."

"ఔను, ఈమధ్య యిదోటివచ్చింది. పోనీగాని మా అన్నల పంచాయతీ లెట్లున్నాయి."

"ఇప్పుడసలే పడతలేదమ్మా యిద్దరికి చెరో కమిటీలు అయిపోయింర్రు, రోజు రోజుకు ముదురుతుంది "

తను అనుకుంటూనేఉంది యిట్లాంటిదేదో జరుగుతుందని. వారు యెప్పుడూ అంటుంటారు. "మీ అన్నలు ఈ జన్మలో అన్నదమ్ముల్లాగా కలిసి ఉండలేరని." అయినా తనేం చేయగలదు. తను వాళ్ళిద్దరూ కలిసిఉండాలని యేన్నిసార్లు ప్రయత్నించినా ఫలితమేమైనా ఉందా? యిద్దరితో ఎన్నిసార్లు వాదించింది ప్రార్థించింది. "ఈ విషయాలతో నీకేంపనే....నీకేం తెలుసని అట్లా మాటాడుతావు" అంటారు యిద్దరూను. నాన్నకు ఎప్పుడూ అదో పెద్దరంధి. ఇద్దరూ ఆయినమాటను ఏ మాత్రం కూడా లక్ష్యపెట్టరు. వారితో వేగలేక ఆసి పంపకాలుచేసి యిద్దరికిపంచి తను వేరే ఉంటున్నాడు. ఇద్దరన్నల యిండ్లు పక్క పక్కల్లోనే అందుకే ఏదో నిప్పు యప్పుడూ రాజుకుంటూనే ఉంటుంది. ఇదరిండ్లూ కాస్త దూరంగాఉన్నా బావుండేవి. తనమీద ఆ వదినలకుకూడా ఎంతో ప్రేమ. వాళ్ళుకూడా తమ భర్తలు కలిసి ఉండాలని ఎన్నో దేవుళ్ళకు మ్రొక్కుకుంటారు.

అప్పుడే ఎండ తీవ్రత అధికమైంది. కొమురడు ఉత్సాహంగా బండి తోలుతున్నాడు. నురుగులు గ్రక్కుకుంటూ యెడ్లు పరిగెత్తుతున్నాయి.

సుధ మళ్ళీ కలల్లోకి పోయింది. వస్తున్నప్పుడు వారు రెండు మూడుసార్లు హెచ్చరించారు. "మీ అన్నయ్యల

విషయంలో జోక్యం తీసుకోకు వారే వన్నా కరుకుగా మాట్లాడితే నీవు బాధ పడ్డావు...." తను బాధపడకూడదు. తనకు యేమాత్రం కష్టం కలిగినా వారు తల్లడిల్లి పోతారు. తననో మల్లెపువ్వులా చూసుకుంటారు....పువ్వుల్లో పెట్టి పూజిం చాలనుకొంటారు. తను యెప్పుడూ ఏదోపని చేస్తుందని "ఒక పనిమనిషిని పెట్టుకుంటే యేంపోయిందీ" అంటుం టారు. "మనకున్న ఈ బ్రహ్మాండమైన పనికి పని మనిషెందుకురా. దానికో కుంచెడో కుండెడో దండగ" అంటుంది వాళ్ళమ్మ. "ఛీ! నువ్వెప్పుడూ యింతేనే" అని విసుక్కుంటారు .... తనకోసారి కొద్దిగా జ్వరమొచ్చింది....అబ్బ ఎంత హడలిపోయారు .... ఆ నాలుగురోజులు తనను ఒక్క క్షణమైన విడిస్తేనా ? ఎవరైనా చూస్తే యేమనుకుంటారని కూడా ....

బండియేదో రాయి యెక్కినట్లుంది. బాగా యెత్తేసింది. అజాగ్రత్తగా కూచున్న సుధకు బాగా దెబ్బతాకింది. "అమ్మా" అంది బాధగా.

"దార్లోనే ఎవ్వడోరాయి పడేసిం డమ్మా చూల్లేదు....దెబ్బ తాకినట్లుంది" అన్నాడు కొమురడు.

"కళ్ళు పెళ్ళికిపోయినయా....ఎటు చూస్తున్నావు. రాయుంటే కాస్త తిప్పి పోనీయొదు ... అబ్బ! ఎంత దెబ్బ తాకింది' అంది సుధ కోపంగా.

సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు. మంటగాడ్పు వీచడంకూడా మొదలెట్టింది. ప్రయాణం విసిగించడం మొదలెట్టింది.

"ఇంకా ఎంతదూరం ఉందిరా ?" అడిగింది సుధ.

"ఇంక రెండు కోసులుందమ్మ .... చాలాదూరం దాటినం....అగో దూరంగా ఆ తాళ్ళు కనబడతలేవు....అయిదాటితే మనోరేనాయె."

తన ఊరు దగ్గరౌతుందంటే సుధ మనస్సంతా తన ఊరుమీదకు మరలింది. తను పుట్టి పెరిగినఊరు....ఆ ఊర్లోనే తను బొమ్మల పెళ్ళిళ్ళు చేసింది. ఆ వూర్లోనే తనకు తెలియని పసితనంలో తన అమ్మను ఎటో తీసికెడుతూంటే గుండెలు పగిలేట్లుగా యేడిచింది. ఆ వూర్లోనే "పూర్వం దశరథుడను రాజు అయోధ్యను పాలించుచుండెను" అని చదువుకొంది ఆ వూర్లోనే తన తండ్రి కన్నులకు కాంతిగా, అతని జీవితానికి పరమార్థంగా పెరిగింది. ఆ ఊరిలోని ప్రతి ప్రాణికీ తనకూ ఒక మధురాతి మధురమైన అనుబంధం అలా తన రక్తంలో జీర్ణించుపోయింది ఇప్పుడు వాం సన్నిధిలో ఆ ఊరును కొంత కాలం మరిచి పోగలుగుతోంది. కాని ఇప్పుడాఊరికి వెడుతున్నానన్న భావన తన హృదయాన్ని వెర్రి ఆనందంలో ముంచెత్తోంది.

ఊరు దగ్గరౌతున్న కొద్దీ సుధకు ఆ వూరిలో కావలసిన వాళ్ళంతా ఒక్కొ క్కరే జ్ఞాపకం వస్తున్నారు. వాళ్ళంతా ఎలా ఉన్నారో ? బాల్యంలో తనను ఎప్పుడూ వీడని స్నేహితురాండ్రు .... యెప్పుడూ యేదో అలౌకిక లోకంలో విహరించే తన సహచరులు. వాళ్ళని

గూర్చి కొమరన్ని అడగాలనిపించింది

"ఆ కమలమ్మ బావున్నాదిరా ?"

"యే కమలమ్మమ్మా ?"

"అదే....కోమటోళ్ళ కమలమ్మ"

"కొమటోళ్ళ కమలమ్మా....యేం బాగమ్మా....ఆ అత్తోరు యింక తీసుక పోలేరటగా"

"అయితే యింకా వాళ్ళ గొడవ అలాగే ఉందన్నమాట. కమల తనకు చాలా దగ్గర స్నేహితురాలు. చిన్నా నాడెన్నడో తనకు తెలియని కాలంలో దానికి పెళ్ళి అయిందట. ఆ మొగడికేం నానా హింసలు పెడ్తాడట-అని భరించ లేక యిప్పుడు తల్లిగారింటి దగ్గరే ఉంటోంది. పాపం-కమల....ఎంత విదారంలోకూడా ఎప్పుడూ నవ్వేస్తుంది. నవ్వుతుంటుంది. ఎప్పుడోగాని తన విషాదగాథను చెప్పుకోదు. "నీ కేం సుధా ! నువ్వు అదృష్టవంతురాలివి" అంటుంది తనను. దాని జీవితం ఎప్పుడైనా బాగుపడ్తుందో-లేదో ?"

తర్వాత ప్రమీల జ్ఞాపకంవచ్చింది. దాన్ని జ్ఞాపకం చేసుకుంటే నవ్వొస్తుంది.

"ఆ కాపోళ్ళ ప్రమీల ఎలా ఉందిరా ?"

కొమరడుకూడా నవ్వాడు. "ఆ అత్తకూ కోడలుకూ ఎప్పటికీ యేదన్న కీచులాట ఉంటదమ్మా."

"ఔను ప్రమీల తన అత్తనుగురించి నానా కథలుచెప్తూ నవ్విస్తుండేది "మా అత్తంటే యేంటనుకున్నారు. రాక్షసి - అచ్చు సినిమాలో సూర్యాకాంతమే అనుకో" అంటూంటే అంతా విరగబడి నవ్వేవాళ్ళు. వాళ్ళ అత్త రాక్షసి అయితే ఇది బ్రహ్మరాక్షసి - యెప్పుడూ ఆ అత్తకు దగ్గపనేదో చేస్తూనేఉంటుంది.

"మీ అత్త యెలాంటిదే" అని అడుగుతుంది తనను.

"మా అత్త చాలా మంచిది" అంటుంది తను.

"పెట్టిపుట్టావే!" అంటుంది ప్రమీల.

ఆ తర్వాత రాధ జ్ఞాపకంవచ్చింది.

"ఆ బాపనోరి రాధమ్మ బావున్నాదిరా ?" అడిగింది.

"ఆ తల్లా? బాగానేఉందమ్మా"

రాధ....రాధను జ్ఞాపకం చేసుకుంటే కన్నులు చెమ్మగిల్లుతాయి. చాలారోజుల దాకా రాధ జీవితానికి యేలోటులేదు. కాని అకస్మాత్తుగా రాధభర్త చనిపోయాడు. అంతే ! రాధ జీవితంలో నిప్పులుపోసి పోయాడు. రాధ ముఖం మీద చిరునవ్వు చెరగిపోయింది. కళాకాంతులు నాశనమయ్యాయి. జీవితం రాధను యింతఘోరంగా ఎందుకు మోసగించిందో తల బ్రద్దలు జేసుకున్నా అర్థంకాదు. తనంటే రాధకు ఎంతో ప్రేమ. ఎంతో ఆత్మీయతతో మాట్లాడుతుంది. రాధతో మాట్లాడుతుంటే గంటలకి గంటలు యిట్టే గడిచేవి.

"అదృష్టవంతురాలివి సుధా! మీవారి సేవలో మమ్మల్ని పూర్తిగా మరచిపోయావా? ఎప్పుడైనా నా జ్ఞాపకం చేసుకుంటావా?" అనేది. ఓర్రాత్రి వీళ్ళం

దర్శిగూర్చి వారితోచెప్పింది - ఎంత శ్రద్ధగావిన్నారు. "ఔను సుధా! ఈ దేశంలో స్త్రీల జీవితాలు యిలాగే ఉంటాయి" అంటారు.

ఇలాగే స్నేహితురాండ్లను గూర్చి ఆలోచిస్తుంటే సుధకు తన వదినలు జ్ఞాపకంవచ్చారు. ఇద్దరొదినలకు తనంటే ఇష్టమే. చిన్నొదినది బి. ఏ. ఆ గర్వం కాస్తా చూపించుకోబోతుంది. డిటెక్టివ్ నవలలు, వెండితెర నవలలు, చదువుతుంటుంది. "ఓహో బి.ఏ. దొరసానీ!" అంటూ తనామెను నవ్వుపట్టిస్తుంది. చిన్నన్న తాగుతాడని, పెద్దబావతో ఎప్పుడూ ఏదో కయ్యంవుంటుందని ఆమెకు కాస్తరంధి. తనతో గంటలకి


## జయశ్రీ

సచిత్ర మాస పత్రిక

●

చందా వివరాలు:

సం॥ చందా 15-00
(ప్రత్యేక సంచికతో సహా)
ఆరు మాసాలకు 8-00

వివరాలకు:

సర్క్యులేషన్ మేనేజర్
జయశ్రీ, మాసపత్రిక
విజయవాడ-2.


గంటలు మాట్లాడుతుంది. మనస్సు చాలా మంచిది. "నీకేం సుధా! నీకిట్లాంటి చిక్కులేమి లేవు అదృష్టవంతురాలవు" అంటుంది తనను.

పెద్దొదిన తరహాయే వేరు ఆమె తల్లిగారు బాగా డబ్బున్న వాళ్ళట - ఆమెలో ఆ గర్వం కన్పిస్తుంది. కాని తనంటే బాగానేచూస్తుంది "మా సుధ చాలా అదృష్టవంతురాలు" అంటుంది తనను అందరిలాగే-"తల్లిలేని పిల్లవైనందుకు అట్లాంటిఅత్తగారు.... అట్లాంటి భర్త దొరకడం నీ నోము ఫలంట" అంటుంటుంది.

ఇలా స్నేహితురాళ్ళు, వదినెల గూర్చి ఆలోచిస్తూ చాలాకాలం గడిపింది సుధ. బయట యెండ తీవ్రత, వడగాలి యెక్కువైనాయి "ఎంతకూ ఈ వూరు రాదేం ?" అనిపించింది.

"త్వరగా పోనీరా! ఇంకెంతదూరం ఉంది"

"దగ్గరకొచ్చినం గదమ్మా. మనూరు కనబడతూనే ఉంది" దూరంగా ఊరు కన్పిస్తోంది. ఒక్కసారి సుధ శరీరమంతా పులకించిపోయింది. మనస్సంతా ఆనందంతో ఉరకలువేసింది. నరాల నిండా క్రొత్తరక్తం ప్రవహించింది. తన వూరి పొలిమేరల్లోకి అడుగుపెట్టి నప్పుడల్లా మనస్సంతా అలా వెర్రి పారవశ్యంతో నిండిపోతుంది.

"ఇగో మీ చిన్నన్న పొలంగూడ వచ్చె" అన్నాడు కొమరడు.

"అరే! అప్పుడే చిన్నన్నపొలం

వచ్చేసిందా" అని బయటకు చూసింది సుధ. ఇక్కడినుంచి అన్నీ వాళ్ళ పొలాలే. దూరంగా కన్పించే ఆ మామిడి గుంపులోనే వాళ్ళ బావి. చిన్నప్పుడు ఎన్నోసార్లు ఆ మామిడి చెట్ల క్రింద పొద్దస్తమాలు యేవో ఆటలు ఆడుకొనేది తను - తన స్నేహితురాళ్ళతో -

"ఇగో ఇవి మీ పెద్దన్న పొలమే నాయె" అన్నాడు కొమరడు మళ్ళీ.

"తెలుసు లేరా! ఈ ఊరికి క్రొత్తగా వస్తున్నట్లు చెప్తున్నావు" అంది. సుధకు మళ్ళీ వాళ్ళన్నలు జ్ఞాపకం వచ్చారు.

"సరే కాని కొమురా! మా అన్నలు పోట్లాటలు యింకా ఎక్కువైనాయా?"

"చెప్పలేదమ్మ. ఈ మద్దె పంచాయతి బోడని పెద్ద లొల్లి పుట్టింది. ఓట్లట రెండుపార్టీలు గట్టిండ్రు.... పోటీ మీ పెద్దన్నకు రంగారెడ్డి దొరకు రంగారెడ్డికెయ్యా మీ చిన్నన్న చేరిండు ఆరంటే ఊరు ఊరంటే అరు మండి పడతాండ్రు .... ఈ ఓట్లుపడే లోపల యెందరి తలలెగిరిపోతాయో."

ఒక్కసారి సుధ గుండెల్లో పిడుగు పడ్డట్లయింది మనస్సు నిండా భయం ఆవరించింది. రంగారెడ్డిని గురించి ఆ ఊళ్ళో రకరకాల కథలు చెప్పుకుంటారు. ఆ వూళ్లో వాడుచేసిన దౌర్జన్యాలకు అంతులేదట. ఆవూళ్లోఉన్న ప్రతి పేదింటి పడుచువాడి పాలేనట. ఎప్పుడూ తాగుతూ ఉంటాడట. వాడికీ నాన్నకు ఎన్నాళ్ళనుంచో శతృత్వం అట. వాన్ని కాస్త అణచివేయగలిగింది ఒక నాన్నేనట. చాలా రోజులుగా వాడు ఆ వూళ్లో ఉండటంలేదట. యెక్కడో హైద్రాబాద్‌లో ఉంటాడట. వాడితో చిన్నన్న చేరాడా? చిన్నన్న యింతకు తెగించాడా? సుధ నిలువెల్లా కంపించిపోయింది. ఇది చిన్నన్నకు, పెద్దన్నకు పూర్వంలాటి మామూలు భూములు పంపకంలాంటి గొడవకాదు. ఇది యెంత ఘోరానికైనా దారి తీయవచ్చు. ఈ పాడు వోట్లు ఎందుకు పెట్టారో - ఇట్లా అయినవాళ్ళ మధ్య పగలు, ద్వేషాలు రగిలించే పాడు ఓట్లు. ఈ పరిస్థితుల్లో తను ఈ ఊరు ఎందుకొస్తున్నట్లు? ఇంత సేపు తన ఊరు కన్పించినప్పుడు ఉదయించిన ఆ ఆనందమంతా యేమైపోయిందో. ఇప్పుడు భయం, అనుమానం, పొగమంచులాగా తన హృదయాన్ని అలుముకొన్నాయి. ఇదంతా చూస్తూ నాన్నెలా ఉన్నారో?

బండి ఊళ్లో ప్రవేశించింది. బజార్లలో ఉన్నవాళ్ళంతా తనకేసి ఆసక్తిగా చూస్తున్నారు.

ఊరి గోడలనిండా "రంగా రెడ్డి దౌర్జన్యాలను అరికట్టాలి." ఎన్నికల్లో రంగారెడ్డిని చిత్తుచిత్తుగా వోడించాలి" యింట్లో పెదపెద్ద అక్షరాలతో ఏమేమో రాసారు. "ఛీ! పాడుఓట్లు" అని మళ్ళీ అనుకొంది సుధ.

బండి యింటిముందు ఆగింది. ఇంట్లో అడుగుపెట్టటంతోటే చల్లనినాన్న పలకరింపుతో అన్నీ మరచిపోయింది సుధ.

సుధవచ్చి మూడు రోజులయింది. స్నేహితురాళ్ళందరినీ కలిసింది. పెద్దన్న, చిన్నన్న యిండ్లకు వెళ్ళొ

చ్చింది. ఓట్ల గొడవల్లో మునిగిఉన్నారు. చిన్నన్న అసలు కనిపించనేలేదు. చిన్నోడినే చాలా బాధగా కన్పించింది. పూర్వపు ఉత్సాహమేలేదు. పెద్దోడిన గూడా అంతగా ఏమీ మాట్లాడలేదు. ఏమైనా తను ఎవరి విషయంలోను ఎట్లాంటి జోక్యం కల్పించుకో దల్చుకోలేదు.

ఊర్లో ఎక్కడచూసినా గుంపులు గుంపులుగా ప్రజలు. యే యింట్లో చూసినా యేవో గుసగుసలు. తనకి తెలిసినప్పటి నుంచి ఈ వూర్లో యిట్లాంటి వాతావరణాన్నిచూసి ఎరగదు. నాన్న విషయం అంతా చెప్పాడు "చిన్నోడు పూర్తిగా చెడిపోయాడు. ఆ రంగారెడ్డిగాడు ఈ అన్నదమ్ములకు చాలా రోజులనుంచి పడటంలేదని తెలుసుకొని వాణ్ని చేరదీసాడు. వాడు పట్నంనుంచి తెచ్చిన బీర్, బ్రాంది, విస్కీలు బాగా తాగుతున్నాడట. వీడు వాటికిమరిగి వాడికే పూర్తిగా లొంగిపోయాడు. ఎలాగైనా ఈ ఊరికి ప్రెసిడెంటయి బ్లాకును చేజిక్కించుకోవాలని వాడి ఉపాయం అట. తమ్ముణ్ని చేజిక్కించుకుంటేగాని అన్నను ఓడించడం సులభంకాదని తెలుసుకున్నాడు. నాశనమయ్యే రోజొచ్చింది. ఏం చేస్తాం" అన్నాడు.

"యేమోనాన్న .... యిదంతా చూస్తుంటే చాలా భయంగావుంది" అంది తను.


"నీకెందుకే భయం పిచ్చిదానా! నాలుగు రోజులుండిపోయే దానవు. నీ భర్త, నీ సంసారం రాణీలాంటి బ్రతుకునీది. ఈ గాడిదలే కొట్టుకు చస్తారు. కళ్ళల్లో ఉన్నట్లున్నావు. నాలుగు రోజులుండిపోతుందని బండి తోలించాను. నువ్వు యివేవీ పట్టించుకోకు" అన్నాడు నాన్న.

సుధ ఆరోజు పోస్టుకోసం ఎదురు చూస్తోంది. అనుకున్నట్టుగానే సుధకు ఉత్తరంవచ్చింది. ఔను తనకు తెలుసు. వారు తనను మరచి ఒక్కక్షణంగూడా బతకలేరని .... అబ్బ పెద్దఉత్తరం. ఏమేమో రాసారు. ఒకగంటసేపు తనివితీరా వారితో మాట్లాడినట్లనిపించింది. అప్పటికప్పుడే నాలుసార్లు చదువుకొంది. చదివినప్పుడల్లా క్రొత్తగా చదివినట్లే వుంది. చదివినప్పుడల్లా యే సుందర లోకాల్లోనో విహరిస్తున్నట్లుగా వుంది నాలుగైదు రోజుల్లోవస్తారట .... ఎప్పుడొస్తారో ఆ నాలుగైదురోజులు. వెంటనే వారికుత్తరం రాయాలి .... అప్పుడే సాయంకాలమవుతోంది. త్వరత్వరగా పనులు ముగించుకొని వారికి ఉత్తరంరాయాలి.

రాత్రి తొమ్మిదిగంట లౌతోంది. నాన్న యింకా రాలేదు. వచ్చేప్పుడు కవరుతెమ్మంది. మరచిపోడుకదా! తను యింత తొందరపడుతున్నా నాన్న రావడంలేదు. వచ్చాక బాగా కోప్పడాలి.

నాన్నవచ్చాడు.... "ఏం నాన్నా ఇంత ఆలస్యంచేసావు" అంది కాస్తకోపంగా.

"ఏం లేదే! ఊరిపరిస్థితి రోజు రోజుకు అధ్వాన్నమయిపోతోంది. ఇంతకుముందు పెద్దలొల్లి .... ఆ రెడ్డోని గడి ముందట్నించి మీ పెద్దన్నపార్టీ



మనిషెవడో పోతాడంట .... అక్షన్నే బాగా తాగి ఆ రెడ్డోడు, మీ చిన్నన్న, వాళ్ళమంది ఉన్నారట." ఈ గాడిద కొడుకును తన్నరా" అన్నాడట రెడ్డోడు. మీ చిన్నన్న వాన్నిపట్టుకు మెత్తగా కొట్టిండట. అది ఇప్పుడే మీ పెద్దోళ్ళకు తెలిసింది. మీ పెద్దన్న మండిపడతాండు."

"ఛీ! యిక్కడకు వచ్చినప్పటినుండి యీ పాడుగోడవే" అంది సుధ.

"పోపీగాని త్వరగా అన్నంతినాలి నాన్న.... నాకు చాలా పనుంది."

"యేం పనే? ఉత్తరం రాసుకోవట మేగా.... అల్లుడు ఎప్పుడొస్తానన్నాడు."

"యేమో నాకేం తెలుసు" అంది సుధ.

"ఇక్కడ నా బ్రతుకు ఎలాఉన్నా నిన్ను చూసుకొనే బ్రతుకుతున్నా .... నీ కాపరమైనా హాయిగా ఉంది. నాకంతే చాలు. త్వరలోనే నీ కోపంఉంటికొడుకు పుడితే చూడాలని వుందే." అన్నాడు నాన్న సుధకు సిగ్గూ, కోపం రెండూ వచ్చాయి.

రాత్రి పది గంటలవుతోంది.దూరంగా ఎక్కడో అరుస్తున్న కుక్కల చప్పుడు తప్ప ఊరువంతా గంభీరమైన ప్రశాంతత ఆవరించింది. సుధ దీపం ముందు కూర్చొని, పెన్ను నోట్లో పెట్టుకొని ఆలోచిస్తోంది.

ప్రియమైన మీకు,

ఇవాళనే మీఉత్తరం వచ్చింది. ఎన్ని సార్లు చదువుకున్నానో ఇక్కడికి వచ్చి

నప్పటినుంచి ఎప్పుడూ మీరే జ్ఞాపకం వస్తున్నారు ఎప్పుడొచ్చి మీ హృదయం మీద...."

ఇంతవరకు రాయడం తోటే ఆ నిశ్శబ్ద వాతావరణాన్ని ఛేదిస్తూ "నా మనిషిని కొడతావా? యివ్వాళ వాడి రక్తాన్ని కళ్ళ చూస్తాను' అన్న పెద్దన్న కేకలు కర్ణంగా వినిపించాయి సుధ ఒక్కసారి ఝడుసుకొంది

"చూస్తావురా రక్తాన్ని. ఏదీ రారా" అన్న చిన్నన్న కేక ఆ వెంటనే.... సుధ ప్రాణాలు పోయాయి." రారా? నువ్వో నేనో ఈ రోజుతో తెగిపోవాలె పెద్దన్న కంఠం. సుధ ఇక నిలవలేకపోయింది. అప్పుడే నిద్రపోతున్న నాన్న యేమిటీ ఆ కేకలు అని లేస్తున్నాడు." ఏముంది చినన్న, పెద్దన్న" అంటూ రాస్తున్న ఉత్తరాన్ని అలాగే పట్టుకొని యింటి వెనుకకు నక్కింది 'అక్కడకు నువ్వెందుకే' అన్న మాటలు వినినించుకోకుండా.

అక్కడి దృశ్యం సుధను పిచ్చిదాన్ని చేసింది ఇద్దరి చేతుల్లోనూ లావుపాటి కర్రలు. వైరిద్వేషంలో ఊగిపోతున్నారు. క్షణంలో ఒకొర్నొకరు సమీపించారు. ఇద్దరూ తాగుడు మైకంలో మైమరచి ఉన్నారు.

సుధ నరనరాల్లో యేదో పెర్రి ఆవేశం తెంచుకొని ప్రవహించింది. ఆ ఆవేశంలో సర్వమూ మరచిపోయింది. రెప్ప పాటు లో వాళ్ళిద్దరి మధ్య సుధ. ఇద్దరి కర్రలు సుధ తలమీద.... రక్తం వరదలు కట్టింది ఇద్దరన్నలూ గోలుమన్నారు. సుధచేతిలో నలుగుతున సగం రాసిన ఉత్తరం ఆ రక్తపు మడుగులో కలిసిపోయింది:...

## రచయితలకు మనవి

'జయశ్రీ' మాసపత్రికకు రచనలు పంపేవారు రచనలతో బాటు తగు స్టాంపులు అంటించిన పూర్తి చిరునామాగల కవర్లను పంపనిదే ప్రచురణకు ఆమోదం కాని రచనలను త్రిప్పిపంపడం సాధ్యంకాదు. కవరులో విడిగాగాని ఆ తర్వాత ప్రత్యేకంగా గాని, స్టాంపులు పంపవద్దని మనవి. రచన ప్రచురణకు అంగీకారమైనచో మేమే ఆ విషయాన్ని తెలియచేస్తాం. ఈ సందర్భంలో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపబడవు. ఎడిటర్.